# 9

# రాగిణి

ఆఫీసు నించి వస్తూనే ఆ రోజు వచ్చిన పోస్టు చేతిలోకి తీసుకుంది రాగిణి. రెండూ కవర్లే. ఒకటి అమ్మ దగ్గర్నించి రెండోది చిన్ననాటి స్నేహితురాలు. అమ్మ ఉత్తరంలో ఏం ఉంటుందో తెలుసు. రెండే ముక్కలుంటాయి. "సంబంధాలొస్తున్నాయి. పెళ్ళి చూపులకేర్పాటు చెయ్యమంటావా?" ఇదే రాస్తుంది ప్రతిసారీ. ఫోన్లో అయితే పెళ్ళిమాట ఎత్తేసరికి తను ఫోన్ పెట్టేస్తుందని తెలుసు. అందుకే తన సెల్‌కి చేసి కుశల ప్రశ్నలు మాత్రం మాట్లాడుతుంది.

ముందు అమ్మ ఉత్తరం చదివేసి... కాఫీ కలుపుకుని అప్పుడు తీరిగ్గా స్నేహితురాలి ఉత్తరం అందుకుంది.

అది చదువుతుంటే స్నేహితురాలు వైదేహి ఎదురుగా నిలబడి మాట్లాడుతున్నట్లు అనిపించడమే కాదు నవ్వూ వచ్చింది.

"నా జన్మలో నేనెప్పుడూ ఎవరికీ ఉత్తరం రాయలేదే ఫోన్ చెయ్యడం తప్ప. ఇప్పుడిది రాయడం పూర్తయితే... ఈ మధ్యనే మా పక్కింట్లోకి కొత్తగా దిగిన ఓ రచయిత్రిగారితో నేను సమానం అన్న ఫీలింగ్ నాకు కలగడం ఖాయం. ఇంటర్మీడియట్లో జేరకుండానే నా పెళ్ళయిపోయింది కదా! అప్పట్నించీ గరిటలే తప్ప పెన్ను పుచ్చుకోలేదు మరి నేను. మొన్నీ మధ్య విజయవాడ స్టేషన్లో అమ్మా నాన్నగారూ కనిపించారు. పెళ్ళి పేరెత్తితే చాలు ఫోన్ పెట్టేస్తున్నావని చెప్పారు. అసలు నీకేమొచ్చింది? కొట్టుకుంటూ తిట్టుకుంటూ అప్పుడప్పుడు కళ్ళల్లో నీళ్ళు కుక్కేసుకుంటూ కాపురాలు చేసేస్తున్న నాబోటి వాళ్ళని చూసయినా పెళ్ళి చేసుకోవాలన్న

తపన కలగట్లేదా నీకు? అందుచేత ఏతావాతా నేను చెప్పేదేమిటంటే పెళ్ళి చేసుకోవడానికి ఒప్పేసుకో. అప్పట్నించీ నా కష్టాల ముచ్చట్లు నేను నీతో... నీ కష్టాల ముచ్చట్లు నువ్వు నాతో ఎంచక్కా ఫోన్లో చెప్పేసుకుంటూ మనసులో భారం దించేసుకుంటూ... ఆనందభాష్పాలు రాల్చేసుకుంటూ... అబ్బ... మా పక్కింట్లోకి రచయిత్రి రావడం కాదుగానీ... అప్పుడే చూడు ఆ గాలి నాకెలా సోకిందో! గాలి అంటే గాలో ధూళో అంటారు అది కాదులే. భయపడకు. ఈ ఉత్తరం చదవడం పూర్తవగానే మీ అమ్మగారికి ఫోన్ చేసి ఓ.కె. అని చెప్పు. నేను అక్షింతలు పట్టుకుని రైలెక్కుతాను. ఇంతకంటే ఎక్కువ రాస్తే, నవల రాసినంత ఆయాసపడిపోతాను. ఇంక ఉంటాను మరి".

ఉత్తరం మడిచి పక్కన పెట్టి చిన్నగా నిట్టూర్చింది రాగిణి.

✧ ✧ ✧

తెల్లగా నాజూగ్గా పొడుగ్గా అందంగా ఉంటుంది రాగిణి. పి.జి. చేసింది. చాలానే సంబంధాలొచ్చాయి. ఒక సంబంధం నిశ్చయమయింది. అబ్బాయి తరఫు పెద్దలు అడిగిన చోట... అడిగిన రీతిలో ఘనంగా పెద్ద ఎత్తున నిశ్చితార్థం జరిపించాడు రాగిణి తండ్రి శేషాచలం.

ఆ మర్నాడు అబ్బాయి దగ్గర్నించి ఫోన్.

"అంకుల్... కొంచెంసేపు నేను, మీ అమ్మాయి బయటికి వెళ్ళి రావచ్చునా?" శేషాచలం గుండెల్లో రాయిపడింది.

"కాఫీ హౌస్‌లో కూచుని ఓ అరగంట కబుర్లు చెప్పుకునొస్తాం అంకుల్. జాగ్రత్తగా మీ అమ్మాయిని మీ ఇంటి దగ్గర మళ్ళీ దిగబెట్టి వెళ్తాను" పచ్చివెలక్కాయ గొంతు కడ్డం పడటం అంటే ఏమిటో బాగానే అనుభవంలో కొచ్చిందాయనకి.

"మీరెందుకు సందేహిస్తున్నారో..."

"ఓ అరగంటలో మీ ఇంటి ముందుంటాను" ఫోన్ కట్ చేశాడు.

✧ ✧ ✧

"ఇంతకు ముందెన్ని పెళ్ళిచూపులయ్యాయి నీకు?" కాఫీ తాగుతూ చాలా సీరియస్‌గా మొహం పెట్టి అడుగుతున్న అతన్ని చూసి చిత్తరువే అయ్యింది రాగిణి.

"ఇప్పుడు చెప్పకపోతే రేపు పెళ్ళయ్యాకైనా ఈ ప్రశ్న మొదటిరోజే అడుగుతాను" వక్రమైన చూపుతో వికృతమైన నవ్వు.

"పెళ్ళిచూపులైనప్పుడల్లా... వాళ్ళ దగ్గర్నించి ఏ కబురూ తెలిసేదాకా ఆ చూసి వెళ్ళినవాడిని ఊహించుకుంటూ..." మళ్ళీ ఓ వక్రమైన నవ్వు.

"పెళ్ళయ్యాక ఈ ప్రశ్న నువ్వడిగి ఉంటే నీ జబ్బుకి తగ్గట్టు... నీకు బుద్ధొచ్చేలా నీ తిక్క కుదిరేలా జవాబు చెప్పేదాన్ని" మనసులోనే అనుకుంటూ లేచి నిలబడింది రాగిణి.

"నీకూ నాకూ ఏ సంబంధం లేదు. వస్తాను. నువ్వెవరో, నేనెవరో" చరచరా బయటికొచ్చి ఆటో ఎక్కింది.

ఇంటికి చేరగానే చెప్పులిప్పి తిన్నగా తన గదిలోకి నడిచింది.

"ఏవిటే... కార్లో వెళ్ళి ఆటోలో వచ్చావు?"

"అలాంటి పరిస్థితి వచ్చింది".

"ఏవిటి ఏవైందే?" పార్వతి గొంతులో కంగారు ధ్వనించింది. కూతురి వెనకే గదిలోకొచ్చింది.

"నే నీ పెళ్ళి చేసుకోనమ్మా...' రెండు చేతుల్లో మొహం దాచుకుంది వస్తున్న ఏడుపుని ఆపుకోలేక.

తల్లీ కూతుళ్ళను ఆ స్థితిలో చూసిన శేషాచలం భయపడుతూ గది గుమ్మం దగ్గరే నిలబడిపోయాడు.

"ఏం జరిగింది?"

"ఈ పెళ్ళి..." ఎలా చెప్పాలో తెలియనట్టు చూసింది పార్వతి.

"ఊ... ఈ పెళ్ళి".

"చేసుకోదుట".

పక్కనే పిడుగు పడినట్టయిందాయనకి.

"కొంచెం మంచినీళ్ళు తెచ్చియ్యి అమ్మాయికి".

మంచినీళ్ళు తాగి కాస్త స్థిమిత పడింది రాగిణి.

"ఏం జరిగింది తల్లీ?"

చెప్పింది అసలు విషయం.

"పెళ్ళయ్యాక ప్రతిరోజూ ఇంకెన్ని విషయాల్లో ఎంత పీడించుకు తింటాడో మీరే ఆలోచించండి".

"నిజమే తల్లీ".

"ఏవిటండీ మీరు కూడా... అమ్మాయికి నచ్చచెప్పాల్సింది పోయి..."

"నచ్చచెప్పాలా? ఆడదానికీ ఓ మనసుంటుందనీ... ఓ వ్యక్తిత్వం ఉంటుందనీ అర్థం చేసుకోలేని వాడిని చేసుకోమని నచ్చచెప్పాలా?"

కృతజ్ఞతాపూర్వకంగా తండ్రి వంక చూసింది రాగిణి.

మంచమ్మీంచి లేచి తల్లి చేయి అందుకుంది.

"అమ్మా... నాన్నలాంటి మంచి భర్త నీకు లభించాడు కాబట్టి మగవాళ్ళందరూ ఇంత మంచి వాళ్ళే అన్న అభిప్రాయంలో ఉన్నావు నువ్వు. బయటి ప్రపంచం ఎలా ఉందో గమనించట్లేదు... పరిస్థితులెలా మారిపోయాయో ఎలా ఉన్నాయో పట్టించు కోవలసిన అవసరంలేక పరిశీలనా దృష్టితో చూడట్లేదు నువ్వు. మా తరం ఆడపిల్లలు ఆలోచించి అడుగు వెయ్యకపోతే ఊబిలో దిగబడిపోయినట్లే..."

"నిజం పార్వతీ... ఒక విధంగా మనం అదృష్టవంతులం. ఇప్పుడైనా వాడి స్వభావం తెలిసింది మనకి".

"కానీ ఎలాగండీ? నిశ్చితార్థం అయిపోయింది".

"ఈ రోజుల్లో పీటల మీద పెళ్ళిళ్ళే ఆగిపోతున్నాయి. ఎందుకు భయపడతావు?"

"ఏం చెప్తారు వాళ్ళకి?"

"తప్పదు మరి... ఆలోచించి ఏదో చెప్తాలే..."

చూసిన మొదటి సంబంధమే ఆదిలోనే హంసపాదల్లే అయ్యింది.

✧ ✧ ✧

మళ్ళీ కొన్నాళ్ళకి పెళ్ళి చూపులనేసరికి రాగిణికి ఇబ్బందిగా అనిపించిన మాట నిజం.

అమ్మా నాన్న ఎంతో నచ్చచెప్పిన మీదట ఒప్పుకోక తప్పలేదు.

పెళ్ళికి తానేమీ వ్యతిరేకం కాదు. పెళ్ళి అనే తంతు మీద కోపమూ లేదు. అందుకని పెళ్ళి చూపులకి అభ్యంతరం చెప్పలేదు.

నిశ్చితార్థం కూడా ఘనంగా జరిగిపోయింది.

భోజనాలనంతరం అందరూ కబుర్లలో ఉన్నారింట్లో.

ఇంటిముందు ఆవరణలో ఎడమవైపు గులాబీ మొక్కలకి సన్నజాజి పందిరికీ మధ్యన కుర్చీల్లో రాగిణి... అతను...

ముద్దులొలికే గులాబీ బాలల అందాన్ని మైమరచి చూస్తోంది రాగిణి.

"నేనొకటి చెప్పాలి నీతో. నాకు మందు పుచ్చుకునే అలవాటు బాగా ఉంది. అమ్మాయిల దగ్గరికి వెళ్ళే అలవాటు కూడా ఉంది. పెళ్ళయ్యాక నువ్వు అడ్డు చెప్పకూడదు నా అలవాట్లకి".

గులాబీ అందానికి మురిసిపోతున్న రాగిణికి దానికింద దాగి ఉన్న ముల్లు కసుక్కున గుచ్చుకున్నట్టయింది. సూటిగా మనసుకే గుచ్చుకుంది.

తను వింటున్నదేమిటి? అతని నోటి నుంచి వచ్చినవి మాటలా? కాదు...

తనని విసిరిపడేసిన సుడిగాలులు కావూ?

భూమిలోకి తోసి తనని కప్పేసిన కొండరాళ్ళ గుట్టలు కావూ?

ఏం జరుగుతోంది తన జీవితంలో?

ఎంత నిర్దయ ఆ భగవంతుడికి తన పట్ల?

"ఏవిటి మాట్లాడవేం?"

సుడిగాల్లో కొట్టుకుపోతుంటే నోట్లోంచి వచ్చేవి మాటలు కాదు. గొంతు పెగలని కేకలు.

సజీవంగా భూమిలో కప్పబడిపోతుంటే మాటలు కాదు. గుండె లోతుల్లోంచి పెల్లుబుకుతుంది వినపడని ఆర్తనాదం...

అందుకే మనసు ముక్కలైన మూలుగు. గుండె పగిలిన వేదన... నిర్జీవ ప్రతిమలా నిలబెట్టాయి అతని ముందు... ఎప్పుడు కుర్చీలోంచి లేచి నిలబడిందో తనకే తెలియదు.

అతికష్టమ్మీద నాలుగక్షరాలు పలికింది. "క్షమించండి"

అంతే... ఆ మాట పూర్తయిన మరుక్షణం ఎన్నో లంఖణాలు చేసిన దానిలా అడుగులు వేస్తూ ఇంట్లోకి నడిచి... ఎవరో ఒక్క తోపు తోసినట్టుగా తన గదిలో మంచమ్మీద కూలబడింది.

✧ ✧ ✧

ఒకే మనిషికి వెంట వెంటనే ఇలాంటి అనుభవాలా?

తూట్లు పడిన మనసుతో ఉన్న రాగిణికి కంటిముందు ప్రశ్నలు ప్రశ్నలు ప్రశ్నలే తప్ప సమాధానాల్లేవు.

కూతుర్ని ఓదార్చే ప్రయత్నంలో పడింది పార్వతి.

"ఈ సంబంధం క్యాన్సిల్ అని మీకంటే ముందు నేనే అంటాను" భర్త వైపు చూస్తూ స్థిరంగా పలికింది.

"మా అమ్మాయితో... మీ అబ్బాయి ఇలా అన్నాడు... అందుకని మీ సంబందం వదులుకుంటున్నాం అని చెప్పెయ్యనా వాళ్ళకి?"

"అలా చెప్పద్దు".

"ఏం?"

"వాళ్ళమీద కావాలని మనం చెడ్డగా ప్రచారం చేస్తున్నామన్న పేరు మనకొద్దు. మనమీద పగబట్టినా పడతారు. ఎందుకొచ్చిన గొడవలు? ముగ్గురాడపిల్లల్ని కన్న తల్లిదండ్రులం".

"అయితే ఏంటి? ఆడపిల్లలంటే అలుసా? నిశ్చితార్థం దాకా ఎందుకు రానిచ్చాడు? పెళ్ళి చూపులకి ముందే ఏడవలేకపోయాడా ఆ మాట? నిశ్చితార్థం అయ్యాక అప్పుడు చెప్తాడా? చచ్చినట్టు నోరుమూసుకు పడుంటారనుకున్నాడు కాబోలు... అంత ఖర్మ మనకి పట్టలేదు".

మొత్తానికి మధ్యవర్తిమీద భారం మోపి క్షమించమని చెప్పేశాడు శేషాచలం.

అబ్బాయి తల్లి మహా నోరున్న మనిషి. రెండు రోజుల్లో పుకారు పుట్టించింది.

"రాగిణికి పొగరు... గర్వం... పైగా ఎవరో అబ్బాయితో సంబంధం పెట్టుకుని తిరుగుతూ మా అబ్బాయితో పెళ్ళి పేరుతో వేషాలేద్దామనుకుంది. గుట్టు. మాకు తెలిసేసరికి మొహం చూపించలేక, ఇప్పుడు పెళ్ళి చేసుకోవాలని లేదని మధ్యవర్తితో

కబురు చేయిస్తుందా? కలికాలం... ఇలాంటి వాళ్ళ వల్ల మాలాంటి వాళ్ళ పరువులు కూడా నట్టేట్లో కలుస్తాయి..."

అలా అలా వాళ్ళ నోటా వీళ్ళ నోటా ఆవిడ ఊరూ వాడా వాగుతున్న మాటలన్నీ రాగిణీ వాళ్ళకి తెలియనే తెలిశాయి.

కూతురికింక పెళ్ళికావడం ఎంత కష్టమోనన్న బాధతో కుమిలి కుమిలి ఏడుస్తోంది పార్వతి.

ఆత్మహత్య చేసుకోవాలన్న క్షణికావేశం కలిగింది రాగిణికి.

అంతలోనే సర్ది చెప్పుకుంది తనకి తనే... పెళ్ళొక్కటేనా జీవిత పరమావధి? ఇంత చదువూ చదువుకుని తన జీవితాన్ని తను... కావాల్సిన రీతిలో మలుచుకుని బతుకు సాగించలేదా? పెళ్ళి కాకపోయినంత మాత్రాన ప్రాణం తీసుకోవాలా? ఎందుకు ఇంకొకరి కోసం భయపడాలి? నేను చేయని తప్పుకు నేనెందుకు భుజాలు తడుముకోవాలి? ఈ ఆలోచనతో రాగిణిలోని బాధ, నిరాశ, దుఃఖం అన్నీ మంచులా కరిగిపోయాయి. అమ్మని తనే ఓదార్చింది. అందుకు చాలా ఆశ్చర్యపడిన ఆవిడని చూస్తుంటే తన వ్యక్తిత్వం మీద తనకే నమ్మకం కలిగింది.

"నా గురించి తెల్సిన వాళ్ళెవ్వరూ ఆ పుకార్లు నమ్మరు కదమ్మా! అది చాలు మనకి".

"ఇంత ధైర్యం నీకెలా వచ్చిందే తల్లీ?"

"మన అనుభవాలే మనకి పాఠాలు నేర్పుతాయని నువ్వే అంటావు కదమ్మా!"

"భయపడినకొద్దీ భయపెడుతుందీ లోకం. తప్పుచేసిన వాడే తలెత్తుకు తిరుగుతున్నప్పుడు... ఏ పాపం ఎరగని మనబోటి వాళ్ళు తలదించుకుని కుమిలిపోవడం శుద్ధ అవివేకం?" నిక్కచ్చిగా చెప్పేశాడు శేషాచలం.

తండ్రీ కూతుళ్ళిద్దరి వంకా దిగులుగా చూసింది పార్వతి.

✧ ✧ ✧

ఉద్యోగంలో చేరినప్పట్నించీ రోజులు బిజీగా తెలియకుండా గడిచిపోతున్నాయి రాగిణికి. ఆఫీసుకి దగ్గర్లోనే రెండు గదుల పోర్షన్ అద్దెకి తీసుకుని ఉంటోంది. తన పెళ్ళి గురించిన ఆలోచన మానెయ్యమంటుంది ఇంటి దగ్గర్నించి ఫోన్ వచ్చినప్పుడల్లా.

కాదూ కూడదూ అంటే రెండుసార్లు నిశ్చితార్థం జరిగి క్యాన్సిల్ అయిన విషయం చెప్పకుండా ఎవరినీ పెళ్ళిచూపులకి పిలవద్దని చెప్పేసింది.

చెప్తే ప్రతి వాళ్ళూ లేనిపోని అనుమానాలతో పెళ్ళిచూపులకే ఒప్పుకోరసలు అంటుంది పార్వతి.

"చెప్పకపోతే... జరిగిన దాంట్లో నా తప్పేమీ లేకపోయినా... ఆ తర్వాతెప్పుడైనా ఆ చేసుకున్న వాడికి తెల్సినప్పుడు నేనేదో మహాపరాధం చేసినట్టు చూస్తాడు. ఇక అప్పుడు మొదలవుతుంది నరకం. దానికంటే పెళ్ళి చేసుకోకపోవడమే ఉత్తమం" అంటుంది రాగిణి.

✧ ✧ ✧

రాత్రి బండికి బయల్దేరి వస్తున్నామని అమ్మచెప్పగానే అడగకుండా ఉండలేక పోయింది "ఏమిటి విశేషం? హఠాత్తుగా ప్రయాణం పెట్టుకున్నారు" అని.

"వచ్చాక చెప్తాంగా, ఓపిక పట్టు" అంది పార్వతి.

మర్నాడు ఆదివారం కావడంతో ఆఫీసుకి సెలవు పెట్టే అవసరం లేకపోయింది. స్నానాలూ టిఫిన్లూ అయ్యాక అన్నాడు శేషాచలం "మీ ఆఫీసులో రత్నాకర్ అనే అతను ఉద్యోగం చేస్తున్నాడట కదా?"

"ఔను" ఇప్పుడతని ప్రసక్తి దేనికో అర్థం కాలేదు రాగిణికి.

"ఎలాంటి వాడు?"

ఆఫీసులో అందర్లోకి రత్నాకర్ చాలా డీసెన్సీ ఉన్నవాడు. తన పనేమో తనేమో అంతే. అనవసరంగా ఇతర్లతో కబుర్లేసుక్కూచోడం... అందరూ తననే చూడాలన్నట్టుగా ప్రవర్తించటం... ఆడవాళ్ళు కనిపిస్తే చాలు ఏదో వంకన దూసుకుపోయి వాళ్ళతో మాట్లాడాలని చూడటం... తనకంటే తెలివైనవాడు బుద్ధిమంతుడు ఈ లోకంలో లేడన్నట్టు ప్రగల్భాలు చెప్పుకోటం... ఈ తరహా మనిషి కాదు. అందుకే అతనిమీద చాలా మంచి అభిప్రాయమే ఉంది రాగిణికి. అదే చెప్పింది. ఆఫీసులో అందర్లోకీ అతనికే మంచి పేరుందని.

"అతని తల్లీదండ్రీ మొన్న మనింటికొచ్చి పరిచయం చేసుకున్నారు. వాళ్ళుండేది మన ఊళ్ళోనే".

"దానికీ మీ హఠాత్ ఆగమనానికి సంబంధం ఏమిటో?" ఆశ్చర్యంగా చూసింది.

"మనకెవరికీ ఏ అభ్యంతరం లేకపోతే నిన్ను అతను చేసుకోవాలనుకుంటున్నాడని ఆ సంగతి ముందుగా మమ్మల్ని అడగమన్నాడని చెప్పారు వాళ్ళొచ్చి".

"మళ్ళీ మొదటికే వచ్చారా నాన్నగారూ... నా అభిప్రాయం మీకు చెప్పాను కదా".

"ఇప్పుడు కాసేపట్లో అతనిక్కడికొస్తాడు. ఫోన్లో అతనితో మాట్లాడమని వాళ్ళ నాన్నగారు నెంబరిచ్చారు. మొన్న రాత్రే మాట్లాడాను. ఇవాళ పొద్దున్న ఇక్కడికొస్తామని చెప్పానతనితో".

నోట్లోంచి మాట రాలేదు రాగిణికి... ఎలా? ఎలా? ఇటువంటి పరిస్థితి నెదుర్కోవడం ఎలా? సందిగ్ధావస్థలో ఉండగానే బయటి తలుపు చప్పుడవడం... "నమస్కారమండీ... నా పేరు రత్నాకర్" అన్న మాట వినిపించడం జరిగింది.

అతన్ని లోపలికి ఆహ్వానించి కుశల ప్రశ్నలు అడుగుతూ మంచినీళ్ళు అందించి కూతురి దగ్గరకొచ్చాడు శేషాచలం.

"నువ్వెళ్ళి మాట్లాడుతూ ఉండు రాగిణీ" అంటూనే భార్యకి కాఫీ కలపమని చెప్పి తను కూడా ఆవిడ వెనకే వంటింట్లోకెళ్ళిపోయాడు.

ఏం మాట్లాడాలి? ఊహించని ఈ పరిస్థితికి అయోమయావస్థలో మునిగి కంగారుపడుతున్న మనసు మూగపోయింది. కానీ తప్పదు.

అతన్ని పలుకరించడం అయ్యాక పాఠం అప్పచెప్పినట్టు చెప్పింది "క్షమించండి. నేను పెళ్ళి గురించిన ఆలోచన చెయ్యట్లేదు. మా వాళ్ళు మీకు ట్రబుల్ ఇచ్చినందుకు..."

"నాకెవ్వరూ ట్రబుల్ ఇవ్వలేదు. మీరొక్క నిమిషం కూచుంటే నేనొక మాట చెప్పాలనుకుంటున్నాను".

ఇంకేమీ మాట్లాడకుండా అతనికెదురుగా కుర్చీలో కూచుంది.

"నాకు మీరు తెలుసు..."

నవ్వొచ్చింది రాగిణికి. ఇది చెప్పడానికా కూచోమన్నాడు?

"మీరు నాకు తెలుసు. మనిద్దరం ఒకే ఆఫీసులో పనిచేస్తున్నాం కాబట్టి..."

"ఈ ఆఫీసులో మీరు పని చెయ్యకముందు నుంచే మీరు నాకు తెలుసు... మిమ్మల్ని చూశాను".

"ఎక్కడా?"

"మా దూరపు బంధువులబ్బాయి నిశ్చితార్థంలో..."

తెల్లబోయింది.

"ఎవరింట్లో? నేనెక్కడికీ వెళ్ళలేదే?"

"అదే... మీ నిశ్చితార్థం మౌళితో జరిగినప్పుడు..."

బిగుసుకుపోయింది రాగిణి కుర్చీలో.

"వాడికెన్నో దురలవాట్లున్నాయని తెలిసి కూడా మధ్యవర్తి మీ నాన్నగారిని మోసం చేసినందుకు చాలా బాధపడ్డాను. ఆ తర్వాత మీరీ సంబంధం క్యాన్సిల్ చేసుకున్నారని విని సంతోషించాను. మళ్ళీ మిమ్మల్ని ఈ ఆఫీసులో చూశాక... ఎందుకో నాకే తెలియదు చేసుకుంటే మీలాంటి అమ్మాయినే చేసుకోవాలన్న కోరిక బలపడింది. మీకభ్యంతరం లేకపోతే..." మబ్బులు కమ్మేసినట్టున్న రాగిణి మనసులోకి గోరువెచ్చని సూరీడు తొంగిచూసినట్లయింది.

✧ ✧ ✧

తల్లీతండ్రీ రత్నాకర్‌లతో కలిసి పెళ్ళి బట్టల షాపింగ్‌కొచ్చింది రాగిణి.

పెద్దవాళ్ళిద్దరూ పట్టుపంచెల కౌంటర్ దగ్గరుంటే చిన్న వాళ్ళిద్దరూ చీరల కౌంటర్ దగ్గరున్నారు.

"అదిగో ఆ అమ్మాయే... పక్కనున్నాడుగా వాడెవడో... ఎన్నేళ్ళుగానో నడుపుతున్నట్టుంది వాడితో కథ... ఏమీ ఎరగనట్టు మా అబ్బాయితో నిశ్చితార్థం చేసుకుని గుట్టు బయటపడేసరికి మాట మార్చింది".

ఓరగా వెనక్కి చూసింది రాగిణి ఆ మాటలకి.

గుర్తుపట్టింది ఆ మహాతల్లిని... నవ్వింది పువ్వులా... ఎంతో సహనం తొంగి చూసింది నవ్వులో.

"నేను ఎన్నేళ్ళుగానో కథ నడుపుతున్నానని మీరు కథలల్లుతున్న ఇతను మీ బంధువులందరూ బుద్ధిమంతుడని మెచ్చుకునే రత్నాకర్".

వెనక్కి తిరిగి ఆవిడ వంక చూసిన రత్నాకర్ చూపులోని తీక్షణకి తట్టుకోలే తలొంచుకుని గబగబా షాపులోంచి బయటికి నడిచిందావిడ.

*ఆంధ్రభూమి వారపత్రిక, 6 డిసెంబర్ 2007*